ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 19.11.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భవిష్యత్తులో రాష్ట్రంలోని వనరులను , అవకాశాలనూ అందరికీ అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన దోహదం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.
2. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈరోజు వరంగల్ లో నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు.
3. రాష్ట్రంలో కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.
4. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నూలు డిపో ఏర్పాటుకు పరిపాలనపరమైన అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఉప ముఖ్యమంత్రి:**

సమ సమాజ స్థాపన కోసం పునాదులు వేసిన గొప్ప నాయకురాలు - మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ రోజు ఇందిరా జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తూ , ఆమె అంతర్జాతీయంగా దేశానికి గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. వివిధ వర్గాలను కలిపి

ఉంచుతూ దేశాన్ని ఏకతాటిపై నడిపించారని శ్లాఘించారు. హైదరాబాద్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ , రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని తాము ఎన్నికల ముందే చెప్పినట్లు , భవిష్యత్తులో రాష్ట్రంలోని వనరులను , అవకాశాలనూ అందరికీ అందించేందుకు ఈ కులగణన దోహదం చేస్తుందని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ మేరకు మహిళలకు సాధికారత కల్పిస్తూ, ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. అంతకుముందు, హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద , పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్ లో ఇందిరా గాంధీ చిత్రపతం వద్ద నివాళి అర్పించారు.

(MSL)

**ఇందిరా-చిన్నారెడ్డి**

దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసారాని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నా రెడ్డి కొనియాడారు. ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని హైదరాబాద్ , నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
(పీటీసీ, వనపర్తి)

**ఇందిరాగాంధీ-ఆది శ్రీనివాస్**

దేశ తొలి మహిళా ప్రధానమంత్రి , దివంగత ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని , ప్రభుత్వ విప్ , వేములవాడ అది శ్రీనివాస్ అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆమె చిత్రపటానికి శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

(పి టి సి రాజన్న సిరిసిల్ల)

**<u>వరంగల్ ముఖ్యమంత్రి పర్యటన</u>**

ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈరోజు వరంగల్ జిల్లాలో నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. మధ్యాహ్నం హనుమకొండ కుడా గ్రౌండ్స్ హెలీపాడ్ కు చేరుకుని అనంతరం ముఖ్యమంత్రి కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో పాల్గొని ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తారు. మరిన్ని వివరాలు అందిస్తున్న మా వరంగల్ విలేకరి వీణావాణి

**సౌండ్ బైట్**

(వరంగల్ జిల్లా పీ టీ సీ)

**<u>కాలుష్యం-పొన్నం</u>**

రాష్ట్రంలో కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులకు రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు.దేశ రాజధాని డిల్లీలో తీవ్ర కాలుష్యంతో పాఠశాలలను

ముసి వేసే పరిస్థితి వచ్చిందని, అలాంటి పరిస్థితి రాష్ట్రం, హైదరాబాద్ లో రావద్దనే ఉద్దేశంతోనే విద్యుత్ వాహన పాలసీ తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను విస్తృతంగా వాడేలా ఈ పాలసీ ఉందన్నారు. ఈవీ వాహనాలపై రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు వంద శాతం మినహాయింపు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని , కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రజలు 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్వచ్ఛందంగా స్క్రాప్ చెపించాలని పిలుపునిచ్చారు.

(పీఎన్)

**<u>తుమ్మల-రైతు నేస్తం</u>**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఈరోజు సచివాలయంలోని తన కార్యలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముచ్చటించారు. ధాన్యం పత్తి కొనుగోళ్ల పై రైతులను ఆడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలు , సీసీఐ సెంటర్ల వద్ద ఉన్న రైతులు, అధికారులతో మాట్లాడారు.

(పీన్)

**<u>ప్రజాపాలన ర్యాలీలు</u>**

**రా**ష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబరు 7వ తేదీకి సంవత్సరం పూర్తవుతుంది. తమ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన ప్రజా

విజయోత్సవ సంబరాలను నిర్వహిస్తోంది. పలు జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు , అధికారులు ప్రజా పాలన ప్రజా విజయహోత్సవ ప్రచార కార్యక్రమాలను ఈ రోజు ప్రారంభించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి ప్రాంగణంలో పౌర సంబంధాలు , సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రజా విజయహోత్సవ ప్రచార కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

(పీటీసీ, వనపర్తి)

**హుస్నాబాద్ –పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు-2024 కి సంబంధించి సమాచార పౌర సంబంధాల శాఖ , తెలంగాణ సాంస్కృతిక సారథి కళయాత్ర వాహనాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు ప్రారంభించారు. సాంస్కృతిక సారథి కళా బృందం ఈరోజు నుంచి డిసెంబర్ 7 వరకు గ్రామాల్లో గత సంవత్సర కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ పథకంలో భాగంగా మహిళలు 3 వేల 720 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణాలు చేశారని తెలిపారు. కాగా, ఎమ్మెల్యేలు, మంత్రులను ఎవరినైనా కలవవచ్చని, ప్రజలు తమ నిరసనలు తెలియచేసే స్వేచ్ఛ ఉందన్నారు.

(పీఎన్)

**ఆసిఫాబాద్-ప్రజా పాలన**

ఆసిఫాబాద్ జిల్లాలో నేటి నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించనున్నారు. విజయోత్సవాలపై నిన్న సాయంత్రం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే , కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**వేములవాడలో నూలు -డిపో**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో 50 కోట్ల రూపాయలతో నూలు డిపో ఏర్పాటుకు పరిపాలనపరమైన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూలు డిపో ఏర్పాటు ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా తో పాటు ఇతర జిల్లాల్లోని 43 వేల మంది మరమగ్గాల కార్మికులకు లబ్ది చేకూరుతుందని ప్రభుత్వం తెలిపింది. నూలు డిపోకి టెస్కో నోడల్ 1 ఏజెన్సీగా పని చేస్తుందని , డిపో ప్రారంభమైతే దాని నుంచి పరపతి విధానంలో నూలును మరమగ్గాల కార్మికులకు సరఫరా చేస్తారని పేర్కొంది.

పిటిసి, సిరిసిల్ల

**నిర్మల్-ఫుడ్ కమిషన్**

నిర్మల్ జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ఎం.ఏ. ఫహీం అధికారులను ఆదేశించారు. నిన్నసాయంత్రం నిర్మల్ పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి కస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీలలో పిల్లల హాజరు పరిశీలించి , చిన్నారులకు ఇస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.

(పి టి సి, నిర్మల్)

**వరంగల్ -నిధులు కేటాయింపు**

హైదరాబాద్ కు దీటుగా వరంగల్ అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల తో వివిధ విభాగాల పరిధిలో నగరంలో చేపట్టే పనులకు 4 వేల 962.47 కోట్ల రూపాయలు కేటాయించింది. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి 4 వేల 170 కోట్ల రూపాయలు , మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణకు 205 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ కు 160.92 కోట్లు , టెక్స్ టైల్ పార్కులో రోడ్లు , స్కూల్స్, సదుపాయాల కల్పనకు 33.60 కోట్లు , టెక్స్ టైల్ పార్క్ కు భూములు ఇచ్చిన రైతులకు 863 ఇందిరమ్మ ఇండ్ల కోసం 43.15 కోట్ల రూపాయలు కేటాయించింది.

(వరంగల్ జిల్లా పీ టీ సీ)

**ఆసిఫాబాద్-డిగ్రీ కళాశాలల బంద్**

గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చనందుకు నిరసనగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ పాటిస్తున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలో డిగ్రీ కళాశాలలను మూసివేశారు. ఈ సందర్భంగా కళాశాలల సంఘం

నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ ... ప్రభుత్వాలపై నమ్మకంతో కళాశాలలు కొనసాగిస్తున్నప్పటికీ బకాయిల విడుదలపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

(పీటీసీ, ఆసిఫాబాద్)

**<u>వాతావరణం</u>**

రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మెదక్ జిల్లాలో నిన్న అత్యల్పంగా 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుజిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రంగా పెరిగిందని వెల్లడించింది. రాష్ట్రంలో మరో వారం రోజు పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపింది.

పిఎన్

**<u>సిరిసిల్ల-రచయిత</u>**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన , ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 12 కథలను బెంగళూరుకు చెందిన రచయిత్రి ఏంజి శుభమంగళ కన్నడంలోకి అనువదించారు. కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాష్ట్ర స్థాయి కూవెంపు భాషా భారతి పురస్కారాల్లో అనువాద విభాగంలో జాల కథల సంపుటి ఎంపికైంది.

(పీటీసీ, సిరిసిల్ల)